


# డ్యూటీ

నందం రామారావు

హరిశ్చంద్రుడి వయసు పాతిక సంవత్సరాలు.

ఐదడుగుల ఆరంగుళాల ఎత్తు.

ముప్ఫై ఎనిమిది, నలభై అంగుళాల ఛాతీ.

ఏడవ క్లాసు మంచి మార్కులతో పాసయ్యాడు. నల్లగా నిగనిగ లాడుతూ బలంగా వుంటాడు. ఇంకా పెళ్ళి కాలేదు!

అలా అని ఇప్పుడు తనేం పెళ్ళి చూపులు గ్గానీ, ఇంటర్వ్యూగ్గానీ వెళ్ళడం లేదు!

రెండేళ్ళ క్రితం హరిశ్చంద్రుడు పోలీస్ కానిస్టేబుల్ ఇంటర్వ్యూకి వెళ్ళడం, సెలెక్ట్ కావడం జరిగింది.

ఇప్పుడతను డ్యూటీలో వున్నాడు.

ఎక్కడో తెలుసా? -

చీమలు దూరని చిట్టడివిలో, కాకులు దూరని కారడివిలో కాకపోయినా - అలా అనిపించే ప్రాంతంలో డ్యూటీలో వున్నాడు.

* * *

ఎండ తీక్షణంగా వుంది.

ఎండ తీక్షణంగా వుండక చల్లగా వుంటుందా? వుంటుంది!

ఎప్పుడు?-

ఇద్దరు ప్రేమికులు కలుసుకున్నప్పుడు.

సినిమాలో డ్యూయెట్ పాడుతున్నప్పుడు.

ఎండ వెన్నెల్లా చల్లగా వుంటుంది.

కానీ, ఇక్కడ ఎండ మరుగ్గా వుంది!

రోడ్డు కేసిన తారు కరిగి పోతోంది.

వెచ్చటి గాలి - కాలుతున్న పెనం మీద చేతులు వేసినట్టుగా వుంది. కనుచూపు మేరలో ఎక్కడా ఏ సంచారం లేదు. ఎండమావులు మాత్రం మిలమిలా మెరుస్తున్నాయి. రోడ్డు ప్రక్కన పెద్ద పెద్ద వృక్షాలు మాత్రం దర్పంగా నాట్యం చేస్తున్నాయి. ఏ గంటకో ఒక్క బస్సు రయ్‌మంటూ దూసుకెళుతోంది. అదిగో అటువంటి ప్రాంతంలో హరిశ్చంద్రుడు డ్యూటీలో వున్నాడు.

హరిశ్చంద్రుడు ఎండకు నించోలేక ఓ చెట్టు నీడ కొచ్చి కూర్చున్నాడు. ఆ చెట్టుకు చుట్టూ అరుగు కట్టి వుంది. ఆ అరుగు కూడా వెచ్చగానే వుంది. ఐనా, అతను కూర్చున్నాడు. ఆ చెట్టు దగ్గర్నించి సుమారుగా రెండు మైళ్ళ దూరంలో ఓ పల్లె వుంది. ఆ పల్లె నానుకుని మరో బుల్లి పల్లె వుంది. ఆ పల్లెల నుంచి రోజుకు నలుగురైదుగురు ఈ చెట్టు దగ్గరికొచ్చి బస్ కోసం ఎదురు చూస్తూ వుంటారు. ఎప్పటికో వచ్చిన బస్సెక్కి పట్నం వెళ్ళి స్తూ వుంటారు.

హరిశ్చంద్రుడికి ఆకలిగా వుంది. తెల్ల వారు ఝామున లేచి డ్యూటీలోకి రాబోతూ రెండిడ్లీ, ఒక దోశా, కాఫీ తీసుకున్నాడు. అంతే మళ్ళీ 'టీ' కూడా లేదు! పోలీసు వ్యానులో తీసుకొచ్చి, ఇక్కడ దింపి - ''చూడు! ఇక్కడ నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి. చుట్టూ అడవి ప్రదేశం. ఏ సమయంలో ఎక్కడి నుంచైనా సంఘ విద్రోహులురావచ్చు. అందుకని హోం మినిస్టర్ అన్ని జాగ్రత్తలూ తీసుకోమన్నారు. మినిస్టర్‌గారు ఏ టైమ్‌లో ఇటుగా వెడతారో మనకు టైం సరిగ్గా తెలియదు. అంచేత, నువ్వు ప్రతి క్షణం చాలా చాలా జాగ్రత్తగా వుండాలి. తెలిసిందా?'' అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించాడు.

కూర్చున్న హరిశ్చంద్రుడు లేచి చుట్టూ

చూశాడు. అతనికి దూరంగా ఏదో చిన్న కారు రావడం కనిపించింది. గబగబా రోడ్డు మీద కొచ్చి వినయంగా నుంచున్నాడు. ఆ కారు అతన్నేం పట్టించుకోకుండా స్పీడుగా వెళ్ళిపోయింది. హరిశ్చంద్రుడు నిరుత్సాహంగా వచ్చి మళ్ళీ చెట్టు క్రింద కూర్చున్నాడు.

అతనికి ఆకలితోపాటు దాహంగా వుంది.

మంచినీళ్ళు కూడా లేవు. సబ్ ఇన్ స్పెక్టర్ వెళ్ళేటప్పుడు - "నీకు ఒంటి గంట కల్లా బస్సులో భోజనం పంపిస్తాం" అన్నాడు. అయినా ఇంతవరకూ భోజనం రాలేదు.

హరిశ్చంద్రుడు టైం చూసుకున్నాడు.

ఒంటిగంట దాటింది.

ఇంకా ఏ బస్సు రాలేదు!

ఎక్కడికైనా వెళ్ళి మంచినీళ్ళు తాగుదామను కున్నాడు. ఒక వేళ మంచినీళ్ళు తాగడాని కెళ్ళిన సమయంలో మంత్రిగారి కారు వెడితే?

ఆ ఊహకే అతను విపరీతంగా భయపడి పోయాడు. ఇంతలో ఏదో బస్సు రావడం అతనికి కనిపించింది. లేచి వెళ్ళి బస్సు ఆపాడు. ఆపి కండక్టర్‌ను భోజనం విషయం అడిగాడు.

"ఎవరూ ఇవ్వలేదని" చెప్పి కండక్టర్ విజిలూదాడు.

బస్సువెళ్ళిపోయింది.

హరిశ్చంద్రుడికి ఎక్కడాలేని నీరసం వచ్చేసింది. కళ్ళు తిరుగుతున్నాయి. ఓపిక లేక పోవడంతో తడబడుతూ వచ్చి చెట్టుకు ఆనుకుని కళ్ళు మూసుకున్నాడు. ఆ ఎండలో సుడిగాలి రేగి హరిశ్చంద్రుడి కంటి మీద ఇసుక పడింది. గాలి వేడిగా వీస్తూ చెంపల్ని ఛెళ్ళుమనిపిస్తోంది. కళ్ళు మండుతున్నాయి. ఏదైనా బస్సు వస్తుందేమో, తన కింత ఆహారం తీసుకొస్తుందేమోనని కొండంత ఆశతో ఎదురు చూడసాగాడు.

బస్సు జాడలేదు. బస్సు జాడ లేక పోగా తన మీద తనకే అసహ్యం వేసింది హరిశ్చంద్రుడికి!

ఛీ! ఛీ! ఎందుకీ వెధవ బ్రతుకు అని తిట్టుకున్నాడు. ఇంతలో అటుగా బస్సు రావడం కనిపించింది.

"అదిగో బస్సు వస్తోంది. అమ్మయ్యా" అనుకుంటూ తొందర తొందరగా రోడ్డు మీదకెళ్ళాడు.

కానీ, ఏం ప్రయోజనం.

ఆ బస్సు ఆగనే లేదు!

హరిశ్చంద్రుడికి ఏం చెయ్యాలో తోచలేదు. టైం చూసుకున్నాడు.

రెండు గంటలు దాటింది.




ఎండ తన ప్రతాపాన్ని మరింత చూపిస్తోంది.

ఆకలి దహించి వేస్తోంది. కడుపులో ప్రేవులు మాడి పోతున్నాయి. శోషొచ్చి పడిపోయేట్టున్నాడు. చెమటతో వళ్ళంతా తడిసిపోయింది. పైగా ఈ వేసవి కాలంలో ఊపిరి సలపని 'ఖాకీ' బట్టలు!

ఇంతలో ఏదో జీపు వచ్చి హరిశ్చంద్రుడు ప్రక్కన ఆగింది. ఆ జీపును చూడ్డంతోనే అతను ఆకలి సంగతి మరచిపోయి వినయంగా శాల్యూట్ చేశాడు.

"ఏందోయ్. జాగ్రత్త. ఇంకో గంటలో మంత్రిగారొస్తున్నారు" ఇన్‌స్పెక్టర్ కంఠం.

"చిత్తం సార్."

"మంత్రిగారొచ్చే సమయానికి ఏ బస్సునూ రానియ్యకు."

"అలాగే సార్"

జీపు స్టార్ట్ అయింది.

"తనకింకా భోజనం రాలేదని" హరిశ్చంద్రుడు చెబుదామనుకున్నాడు. చెబుదా మనుకున్నంతలోనే జీపు వెళ్ళిపోయింది.

ఇప్పుడు తనేం చెయ్యాలి?

ఎవరైనా కనిపిస్తారేమోనని అటూ ఇటూ చూశాడు.

ఆ ఎండలో ఎవరు మాత్రం ఎందుకొస్తారక్కడికి?

గొంతు ఎండి పోతోంది.

ఉమ్మితో నాలుక తడుపుకున్నాడు.

కడుపులో మంటలు పుడుతున్నాయి.

హరిశ్చంద్రుడు నెమ్మదిగా వచ్చి చెట్టు నీడలో కూర్చున్నాడు.

రెండు క్షణాలు కళ్ళు మూసుకున్నాడు.

కళ్ళు విపరీతంగా మండుతున్నాయి.


'ఒక్క పూట ఆకలికి తాళలేని ఓ మనిషీ! ఎందుకు నీకీ బ్రతుకు?' అని కసితీరా తనను తాను తిట్టుకున్నాడు. అంతకుముందు వారం రోజుల నుంచే తనకు వంట్లో బావుండలేదు. ఆ వారం రోజులూ భోజనమే లేదు. నూట నాలుగు, నూట మూడు డిగ్రీల జ్వరంతో మంచంమీదనే వుండిపోయాడు.

ఎనిమిదో రోజు డ్యూటీలో జాయినయ్యాడు. ఇదిగో తొమ్మిదో రోజు ఇలా, ఇక్కడ డ్యూటీ వేశారు. హరిశ్చంద్రుడు టోపీతీసి, జేబు రుమాలతో చెమట పట్టిన తలతుడుచుకుని, దానితోనే ముఖం తుడుచుకున్నాడు. వాళ్ళో టోపీ పెట్టుకుని సిగరెట్టు తాగుదామనుకుంటూ వుండగా ఏదో కారు హారన్ వినిపించింది. హరిశ్చంద్రుడు దిగ్గున లేచి, పరిగెత్తినంత పని చేసి రోడ్డుమీద నిలబడ్డాడు.

కారువస్తోంది. ఆ కారు ఎండలో మెరిసి పోతోంది. రాచ కన్య ఉద్యానవనంలోకి పల్లకీ ఎక్కి వస్తున్నట్టుగా వస్తోంది ఆ కారు. హరిశ్చంద్రుడు స్టడీగా నిలుచున్నట్టు కుడిచేతిని శాల్యూట్ పోజ్‌లో పెట్టి మరీ నిలుచున్నాడు.

ఆ కారు వచ్చేసింది.

ఆ కారులో వున్న పదహారేళ్ళ పిల్ల హరిశ్చంద్రుడిని ఆ స్థితి చూడగానే జాలేసి కిసుక్కున



నవ్వి వెక్కిరించింది. అంతే, ఆ కారు వేగంగా వెళ్ళిపోయింది! ఆ చిన్నది చేసిన అల్లరికి వెక్కిరించిన తీరుకి మరో సందర్భంలో అయితే హరిశ్చంద్రుడు నవ్వేవాడే కానీ ఇప్పుడతనికి నవ్వు రావడం లేదు.

ప్రొద్దుట నుంచీ ఎండలో మాడిపోతున్నాడు. భోజనం లేదు. మంచినీళ్ళు లేవు. ఇక అతనికి ఆనందంగానే వుంది. ఈ పోలీసు ఉద్యోగమంటే అతనికెందుకో మహాఇష్టం. ఇందులో వుండి అన్యాయాలను, దోపిడీలను సులభంగా అరికట్టవచ్చు. అలాగే, సులభంగా డబ్బూ సంపాదించ వచ్చు. ఐతే, తను డబ్బు సంపాదనకోసం ఈ పోలీసు ఉద్యోగంలో చేరలేదు. ఒక లక్ష్యం కోసం ఈ సమాజానికి ఇంత మంచి చేశామనే తృప్తికోసం తనీ ఉద్యోగంలో చేరాడు.

మరెందుచేతనో పోలీసులంటే ఈ ప్రజలకు చాలా చులకన. బయట చులకనగా చూసే ఈ ప్రజలే ఏ సందర్భంలోనైనా పోలీసు స్టేషన్ ఆవరణలోకి అడుగు పెడితే చాలు విపరీతంగా భయ పడిపోతారు.

బయట చిన్నచూపు
ఆవరణలో భయం
చాలా బావుంది!

ఈ ఆలోచన రాగానే అతనికి నవ్వు కోవాల నిపించింది. ఛాతీలో నొప్పిగా, డొక్కలో మరీ నొప్పిగా, విపరీతమైన తలపోటుగా, కళ్ళు బైర్లు కమ్ముతుండగా హరిశ్చంద్రుడు ఆ ఎండలో ఇక నిలుచోలేక పోయాడు. అతను ఏ క్షణంలోనైనా కళ్ళు తిరిగి పడిపోవచ్చును. అందుకే గబగబా వచ్చి చెట్టునానుకుని కూర్చుని కళ్ళు మూసుకు న్నాడు.

అప్పటికి సాయంత్రం ఆరు గంటలు కావొస్తోంది. పడమటి దిశన సూర్యుడు ఇంకా రౌద్రంగానే వున్నాడు. వెచ్చని గాలి వస్తూనే వుంది. ఆకాశంలో ఒక్క పక్షి కూడా తిరగడంలేదు. ఇదిగో సరిగ్గా అటువంటి సమయంలో—

ముందు ఓ ఇరవై చిన్నకార్లు నడుస్తూ వుండగా, ఆ తర్వాత బోయింగ్ విమానంలాంటి ఎయిర్ కండిషన్డ్ కారులో కూర్చుని అటూ ఇటూ పరికిస్తూ మంత్రి పుంగవులు. ఆ తర్వాత మరెన్నో చిన్నకార్లు, జీపులూ వున్నాయి.

మంత్రి మహాశయులుగారి శాంతియాత్ర సాగుతోందన్న మాట.

శోషొచ్చి చెట్టు క్రింద పడిపోయిన హరిశ్చంద్రుడికి ఇవేవీ తెలియదు.

కానీ, ఘనమైన మంత్రిగారు ఒక కానిస్టేబుల్ చెట్టు క్రింద నిద్రపోవడం చూశారు.

తన దారంట వస్తున్నట్టు తెలిసికూడా ఇంత నిర్లక్ష్యంగా వున్న ఆ కానిస్టేబుల్ మీద విపరీతమైన కోపంతో మండిపడ్డారు.

గొప్పవారు తలచుకుంటే ఏదైనా చెయ్యగలరు.

ఆరోజు హరిశ్చంద్రుడు చాలా ఆనందంగా వున్నాడు. నిద్ర లేవడంతోనే అన్ని పనులూ చకచకా ముగించుకున్నాడు. కొత్తగా కుట్టించుకున్న 'ఖాకీ' బట్టలు తొడుక్కున్నాడు.

ఇవేళ అతని పుట్టినరోజు

పుట్టిన రోజుల్ని చాలా మంది చాలా రకాలుగా చేసుకుంటారు.

అతని వృత్తే అతని జీవితం!

అందుకే హరిశ్చంద్రుడు ఖాకీ బట్టలు కుట్టించుకుని ముచ్చటపడ్డాడు.

టైమ్ చూసుకున్నాడు.

ఎనిమిది గంటలు దాటింది.

'ఇంక డ్యూటీకి వెళ్ళాలి. టైమవుతోంది' అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా హరిశ్చంద్రుడు బయటకొచ్చి గదికి తాళం వెయ్యబోయాడు. ఇంతలో ఓ కానిస్టేబుల్ వచ్చి అతని చేతికో కవరిచ్చి 'ఎస్.ఐ.గారు' ఇవ్వమన్నారు.'' అని చెప్పి మరోమాట మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

హరిశ్చంద్రుడు మళ్ళీ గది తాళం తీసి లోపలకొచ్చి ఆ కవరు చించి చదివాడు.

ఫలాన రోజు ఫలానా ప్రాంతంలో మంత్రిగారొస్తున్న సమయంలో విధి నిర్వహణలో అజాగ్రత్తగా వుండి చెట్టు క్రింద నిద్రపోతున్నందుకుగాను నిన్ను సస్పెండు చేస్తున్నాం — క్రింద డి.ఎస్.పి. సంతకం వుంది.

అది చదవడంతోనే హరిశ్చంద్రుడు హతాశుడైపోయాడు. క్షణకాలం భయంతో కంపించిపోయాడు.

'తన తప్పిదం ఏం లేదనీ, భోజనం లేకపోవడం వల్ల ఆ ఎండలో నిలువలేక శోషొచ్చి పడిపోయానని' '— ఎవరికి చెప్పాలో ఎలా చెప్పాలో తెలియక దిగులుగా వుండిపోయాడు.

అప్రయత్నంగా హరిశ్చంద్రుడి కళ్ళల్లోనుంచి కన్నీళ్ళు జారి అతని ఖాకీ బట్టలమీద నిలిచాయి.

కొత్త ఖాకీ బట్టలమీద నిలిచిన ఆ కన్నీళ్ళు ఇంకా ఇంకిపోలేదు.

